ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ సిద్ధం

ప్రొద్దుటూరులో ఆటో మేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ ఏర్పాటయింది. రవాణా శాఖ అధికారుల ప్రమేయం లేకుండానే సాంకేతిక పరిజ్ఞానంతో సెన్సార్ల ద్వారా డ్రైవింగ్ లైసెన్సు జారీచేయనున్నారు. వాహనాలను సరిగా నడపని యెడల సీసీ కెమెరాల ద్వారా సెన్సార్లు పసిగట్టి ఫెయిల్ చేస్తాయి. ఆర్టీఓ కార్యాలయంలో ఆటోమేటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ఏడేళ్ల నుంచి ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి.

- సెన్సార్‌లు, సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తి
- నేటి నుంచి వాహనాలతో ట్రయిల్ రన్
- వారం తర్వాత ఇదే పద్ధతిలో లైసెన్సుల జారీ


ట్రాక్‌లో ఏర్పాటు చేసిన బొల్లార్ స్టిక్స్


ట్రాక్‌లో ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్లు, సెన్సార్లు

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరులో ఏడేళ్ల కిందట ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నిర్మాణానికి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. రవాణాశాఖ అధికారులు ఎన్నిసార్లు ప్రయత్నం చేసినా వారి గోడు ఎవ్వరూ పట్టించు కోలేదు. ఏడాదిన్నర కిందట వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌కు నిధులు మంజూరుచేసింది. ట్రాక్‌కు సంబంధించిన పరికరాలన్నీ ప్రొద్దుటూరు ఆర్టీఓ కార్యాలయానికి చేరాయి. పనులు ప్రారంభించి కొన్ని అనివార్య కారణాలతో నిలిచిపోయాయి. ప్రభుత్వం ఇటీవల ఆదేశాలిచ్చిన నేపథ్యంలో తిరిగి మొదలయ్యాయి.

సామగ్రి ఏర్పాట్లు పూర్తి

ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం ఆవరణలోని ట్రాక్‌లో రెండు రోజుల కిందట ఎలక్ట్రానిక్ సామగ్రి ఏర్పాట్లు పూర్తి చేశారు. 17 సీసీ కెమెరాలతోపాటు సెన్సార్లు, సిగ్నల్ లైట్లు, బొల్లార్స్ ఏర్పాటుచేశారు. మానిటరింగ్ గదిలో ఇక్కడున్న రెండు ట్రాక్‌లకు వేర్వేరుగా కంప్యూటర్లు అమర్చారు. ఒకే సారి ఇద్దరు డ్రైవింగ్ టెస్ట్ చేయొచ్చు. అలాగే డ్రైవింగ్ చేసే వారికి ఒక ఆర్ఎఫ్ ట్యాగ్ జారీ చేస్తారు. డ్రైవింగ్ పూర్తయ్యే వరకు ఆ వ్యక్తి తన దగ్గరే ట్యాగ్ పెట్టుకోవాలి. డ్రైవింగ్ పూర్తయ్యాక తిరిగి ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఆర్ఎఫ్ ట్యాగ్ వాహనాలు నడిపే తీరును ఆర్ఎఫ్ రీడర్‌కు పంపిస్తుందని టెక్నీషియన్లు చెప్పారు.

ఊపిరి పీల్చుకోనున్న అధికారులు

ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ అందుబాటులోకి రావడంతో రవాణా శాఖ అధికారులు ఊపిరి పీల్చుకోనున్నారు. ఎల్ఎల్ఆర్‌లతోపాటు డ్రైవింగ్ టెస్ట్‌ల జారీలో ఎంవీఐలకు రాజకీయ నాయకులు, ఇతర శాఖల అధికారులు, వివిధ వర్గాల నుంచి పెద్ద ఎత్తున సిఫార్సులు వచ్చేవి. వాళ్ల సిఫార్సులను తోసి పుచ్చలేక అధికారులు ఇబ్బంది పడేవారు. అయితే ఆటోమేటిక్ పద్ధతి రావడంతో అధికారులకు నెత్తిమీద పాలుపోసినట్లైంది. ఈ విధానం ప్రకారం సక్రమంగా డ్రైవింగ్ చేస్తే తప్ప లైసెన్స్ వచ్చే పరిస్థితి లేదు. చిత్తూరు, అనంతపురం, కర్నూలులో ఇప్పటికే ఆటోమేటిక్ టెస్ట్ ట్రాక్ నిర్వహిస్తున్నారు. అక్కడి రవాణాశాఖ అధికారులు, ప్రజలు చెప్పిన ప్రకారం 10 సార్లు డ్రైవింగ్ చేసినా కొందరు పాస్ కాలేదని తెలుస్తోంది.

నేటి నుంచి ట్రయల్ రన్

ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ పనులను ఆర్టీఓ మురళీధర్ మంగళవారం పరిశీలించారు. సంబంధిత టెక్నీషియన్లతో మాట్లాడి వాటి పని తీరును అడిగి తెలుసుకున్నారు. ట్రాక్ శుభ్రపరచి మధ్యలో గ్రీనరీ ఏర్పాటుచేయనున్నారు. ఇదిలా ఉండగా బుధవారం నుంచి ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు ఆర్టీఓ తెలిపారు. నాలుగైదు రోజుల పాటు ట్రయల్ రన్ నిర్వహించి వచ్చే వారంలో ఆటోమేటిక్ పద్ధతిలోనే లైసెన్స్‌లను జారీ చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని చిత్తూరు, అనంతపురం, కర్నూలులో ఈ ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లు నిర్వహిస్తున్నారు. ఇంకా విశాఖపట్టణం, విజయవాడ, నెల్లూరులలో ట్రాక్ పనులు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.

ట్రాక్ పనులన్నీ పూర్తయ్యాయి



ప్రొద్దుటూరు ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయం ఆవరణలో కొన్ని నెలల నుంచి చేస్తున్న ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ పనులు పూర్తయ్యాయి. బుధవారం నుంచి ట్రయల్ రన్ నిర్వహిస్తున్నాం. నాలుగైదు రోజుల పాటు ట్రయల్‌రన్ నిర్వహించి అందులో లోటుపాట్లను గుర్తిస్తాం. వచ్చే వారం నుంచి ఆటోమేటిక్ పద్ధతిలో లైసెన్సులు జారీ చేస్తాం. – పి మురళీధర్, ఆర్టీఓ, ప్రొద్దుటూరు

క్లుప్తంగా

విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ

ప్రొద్దుటూరు క్రైం: ఏపీసీసీ ప్రెసిడెంట్ వైఎస్ షర్మిల పుట్టిన రోజు సందర్భంగా ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ ఇర్ఫాన్‌బాషా విద్యార్థులకు మంగళవారం పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. గోపవరం పంచాయతీలోని భవిత మానసిక దివ్యాంగుల పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కేక్ కట్ చేయించారు. అనంతరం జిల్లా ఆస్పత్రి సమీపంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తొగటవీర క్షత్రియ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తొగటవీర క్షత్రియులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక వసంతపేటలోని చౌడేశ్వరీదేవి తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో మంగళవారం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కల్యాణ మండప అధ్యక్షుడు బండారు రఘు రామయ్య, కోశాధికారి బండారు సూర్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 ఏళ్లుగా క్యాలెండర్ రూపొందించి తొగట కుల బాంధవులందరికీ పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చౌడం వెంకటరమణ, కేసీ. పుల్లయ్య, రమణ, లక్ష్మీనారాయణ, రుద్రయ్య, చౌడయ్య, ప్రకాష్, వెంకటరమణ, రామయ్య, నాగరాజు, బాల, రామమోహన్ పాల్గొన్నారు.

వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకోవాలి

చాపాడు: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం గడువు మరింత పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతూ నివేదిక పంపినట్లు మండల వ్యవసాయాధికారి మ్యాగీ పేర్కొన్నారు. మండలంలోని పెద్దగురువళూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం నమోదుకు ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉండేదని, రైతుల విజ్ఞప్తి మేరకు గడువు పెంచాలని ప్రభుత్వానికి కోరామన్నారు. ప్రస్తుత పరిస్థితులలో వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో నూర్పిళ్లు చేసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు టార్పలిన్ పట్టలతో కప్పి ఉంచాలన్నారు. అనంతరం వ్యవసాయ సాగులో ఎరువులు, పురుగు మందుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజేష్‌రెడ్డి, వీహెచ్ఏ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘానికి నూతన కార్యవర్గం


సి. సుబ్బరాయుడు


ఏవీ రమణయ్య

మైదుకూరు: మండల పెన్షనర్ల సంక్షేమ సంఘ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కడప రోడ్డులో సమావేశమైన పెన్షనర్లు పెన్షనర్ల డేను ఘనంగా నిర్వహించారు. అనంతరం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా చిగురుపాటి సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఏవీ రమణయ్య, ఉపాధ్యక్షుడిగా పి.సుబ్బారెడ్డి, కార్యదర్శిగా బి.సుబ్బరాయుడు, కోశాధికారిగా ఎం.రామాంజనేయులు రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎం.సాంబశివారెడ్డి, వైవీ చలమయ్యతోపాటు మరో నలుగురిని మండల కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సంఘం నాయకులు మాట్లాడుతూ పెన్షనర్ల సంఘానికి సొంత భవనం నిర్మాణంతోపాటు పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు పొలిమేర ఓబన్న, విశ్రాంత ఎంఈఓ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయ సంఘం మాజీ నాయకుడు సూరే కృష్ణయ్య పాల్గొన్నారు.

19న విజయవాడలో రాష్ట్ర మహా సభలు

ప్రొద్దుటూరు: విజయవాడలో ఈ నెల 19న జరిగే ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆరో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా కోరారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్.మంజుల, మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకురాలు రాజమ్మ, ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి పి.ఏసోబ్‌తో కలిసి స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం రాష్ట్ర మహా సభల కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ విభాగాల సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యాధికారులు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలతో చేతులు కలిపి వేతనాల్లో కోత వేస్తూ కార్మికుల పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలో జరిగే రాష్ట్ర మహా సభల్లో సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సరోజమ్మ, ప్రమీల, నాగమ్మ, యశోదమ్మ, చెన్నమ్మ, విమల, లక్ష్మీరంగా తదితరులు పాల్గొన్నారు.

తగాదాలతో భూ సమస్యలు పరిష్కారం కావు


మాట్లాడుతున్న తహసీల్దార్ గంగయ్య

ప్రొద్దుటూరు రూరల్: తగాదాలతో భూ సమస్యలు పరిష్కారం కావని తహసీల్దారు గంగయ్య పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లె పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లె పంచాయతీ పరిధిలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, అధికారులను సంప్రదించి సమస్య పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సదస్సులో రైతుల నుంచి 42 సమస్యలకు సంబంధించిన వినతులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు సాయినాథరెడ్డి, రీ సర్వే డీటీ సుదర్శన్, సర్వేయర్ వెంకటలక్ష్మి, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, గోపాల్‌యాదవ్, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

దళితవాడ సమస్యల పరిష్కారానికి చర్యలు


డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న తహసీల్దారు రమాకుమారి

చాపాడు : సోమాపురం పంచాయతీ పరిధిలోని దళితవాడలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు చర్యలు తీసుకుంటామని తహసీల్దారు రమాకుమారి పేర్కొన్నారు. సోమాపురంలోని గ్రామ సచివాలయం వద్ద మంగళవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన తహసీల్దారు రెవెన్యూ సదస్సు అనంతరం దళితవాడలో పర్యటించారు. ఇక్కడ అధ్వానంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ సమస్యను స్థానికులు తహసీల్దారు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్పందించిన తహసీల్దారు పంచాయతీ అధికారులతో మాట్లాడి డ్రైనేజీ సమస్యను పరిష్కరింపజేస్తామన్నారు. ఇదే క్రమంలో రైతు సమస్యలను కూడా తమ దృష్టికి తీసుకురావొచ్చన్నారు. సోమాపురం రెవెన్యూ పరిధిలో 23 సమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డి, రీ సర్వే డీటీ లక్ష్మీనారాయణ, వీఆర్ఓ సుబ్బన్న, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసపురంలో 'పొలం పిలుస్తోంది'


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నాగరాజ

గోపవరం: మండలంలోని శ్రీనివాసపురంలో మంగళవారం వ్యవసాయాధికారులు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ పాల్గొని రబీ సీజన్‌లో వివిధ పంటలను సాగు చేసే రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ప్రస్తుతం సాగులో ఉన్న మొక్కజొన్న పంటను పరిశీలించి కత్తెరపురుగు ఉధృతిని గమనించి నివారణ చర్యలను రైతులకు తెలియజేశారు. నానో డీఏపీ పిచికారీ చేయడం వలన కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. పంటల బీమా ప్రీమియం చెల్లింపు, ఈ-పంట నమోదు ప్రాధాన్యతను వివరించారు. అనంతరం బద్వేలు పట్టణంలోని సాయిసప్తగిరి ఎరువుల దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విత్తనాలు, ఎరువులు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని డీలర్లను ఆదేశించారు. కొనుగోలు చేసిన రైతులకు రసీదులు ఇవ్వాలని, ధరల పట్టిక దుకాణంలో ఉంచాలని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

కల్వారి టెంపుల్ అధినేత డాక్టర్ సతీష్‌కుమార్



మాట్లాడుతున్న సతీష్‌కుమార్

ప్రొద్దుటూరు కల్చరల్: క్రీస్తు మార్గం అనుసరణీయమని కల్వారి టెంపుల్ అధినేత డాక్టర్ పి.సతీష్ కుమార్ అన్నారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో మంగళ వారం రాత్రి కల్వారి గ్రాండ్ ముందస్తు క్రిస్మస్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వ మానవాళి శ్రేయస్సు కోసం లోక రక్షకుడైన ఏసు జన్మించారన్నారు. ఏసు క్రీస్తు జన్మవృత్తాంతాన్ని, ఆయన మానవాళికి చేసిన మేలును వివరించారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ కల్వారి టెంపుల్ ఆధ్వర్యంలో ముందుస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ భగవంతుడిపై విశ్వాసం, దయ, కరుణ గుణం కలిగి ఉండాలని సూచించారు. అంతకు ముందు భక్తిగీతాలాపన చేసి కేక్ కోశారు. టీడీపీ నాయకుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, తదితరులు సతీష్‌కుమార్‌కు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు, విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


పాల్గొన్న భక్తులు

పీఆర్సీని తక్షణమే అమలు చేయాలి


మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

బద్వేలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణమే పీఆర్సీని అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు మాదన విజయకుమార్, జి.వెంకటసుబ్బారెడ్డిలు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐదేళ్లకొకసారి అమలు చేయాల్సిన పేరివిజన్‌ను అమలు చేయడంలో పాలకవర్గాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారించలేదన్నారు. 2023 జూలై 1వ తేదీ నుండి 12వ పీఆర్సీని అమలు చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పీఆర్సీ సకాలంలో అమలు కాకపోతే పదవీ విరమణ పొందే ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రయోజనాలు అందక తీవ్రంగా నష్టపోతారన్నారు. ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడతామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం తక్షణమే ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలని, తక్షణం పీఆర్సీ కమిషన్‌ను నియమించి పీఆర్సీని అమలు చేయాలని కోరారు. పీఆర్సీ అమలయ్యే వరకు 30 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలని, పెండింగ్ బకాయిలు, డీఏలతో పాటు గత పీఆర్సీ బకాయిలను బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై సానుకూలంగా స్పందించకపోతే పోరుబాట పట్టక తప్పదని వారు హెచ్చరించారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు పి.గోపాల్‌రెడ్డి, ఎస్.ఓబుల్‌రెడ్డి, ఎం.రవిశంకర్, సి.నరసింహారెడ్డి ఎస్.రమేష్‌రాజా, ఎ.పి.సంజీవరెడ్డి, టి.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజీ పడకుండా ఆక్రమణల తొలగింపు


మైదుకూరు రోడ్డులో ఆక్రమణలు తొలగింపస్తున్న తహసీల్దారు గంగయ్య

ప్రొద్దుటూరు: ఎవరితోనూ రాజీ పడకుండా మైదుకూరు రోడ్డులో ఆక్రమణలు తొలగిస్తామని తహసీల్దారు గంగయ్య అన్నారు. మైదుకూరు రోడ్డులో విస్తరణ పనులకు వేసిన మార్కింగ్‌ను సర్వేయర్ వెంకటలక్ష్మితో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఒక చోట ఒక రకంగా.. మరో చోట ఇంకో రకంగా ఆక్రమణలు తొలగిస్తున్న విషయాన్ని గమనించారు. సర్వేయర్లు చేసిన మార్కింగ్ వరకు జేసీబీతో కూల్చివేయించారు. మొదటి బిల్డింగ్ నుంచి చివరి బిల్డింగ్ వరకు సర్వేయర్ మార్కింగ్ మేరకే ఆక్రమణలను తొలగిస్తామని ఆయన తెలిపారు. ఇందులో ఎటువంటి రాజకీయాలకు, పలుకుబడిలకు తావు ఇవ్వమన్నారు. సోమవారం మార్కింగ్ ప్రకారం పనులు జరగకపోవడంతో ఆర్అండ్‌బీ డీఈ లక్ష్మీనరసింహులును కలసి పనులు నిలిపి వేయించామన్నారు. పనులు పూర్తయ్యే వరకు తాను పర్యవేక్షిస్తానని తెలిపారు. ఆయనతోపాటు రీసర్వే డీటీ సుదర్శన్, సచివాలయ సర్వేయర్లు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి


పోరుమామిళ్ల: మాట్లాడుతున్న ఎంపీడీఓ రమణారెడ్డి


ఖాజీపేట: సమావేశంలో పాల్గొన్న అధికారులు

పోరుమామిళ్ల: అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పని చేసినపుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీఓ రమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సభాభవనంలో జరిగిన ఎల్ఎస్‌డిజీ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులకు జరిగిన మొదటిరోజు శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అంశాలు, పథకాలు, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు సాధించడంపై దృష్టి పెట్టాలన్నారు. లక్ష్యసాధనకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. పారిశుధ్యం, తాగునీరు, మహిళా సాధికారిత, చిన్నారుల భద్రత, నీటి వనరులను కాపాడటం తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. శిక్షణలో ఎంఈఓ బాల అంకిరెడ్డి, ఆర్‌డబ్ల్యు ఎఈఈ ఓబన్న, సీడీపీఓ లక్ష్మీదేవి, సర్పంచులు చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, సుధాకర్, రమణారెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

చాపాడు: ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు లక్ష్యాలను ఎంపిక చేసుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని మండల అభివృద్ధి అధికారి వీరకిషోర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనం వద్ద మంగళవారం వీఆర్‌ఓలు, సర్వేయర్‌లు, ఏఎన్ఎంలు, జీఎంఎస్‌కే, ఎనర్జీ అసిస్టెంట్లకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలలో స్థానికంగా అందుబాటులో ఉండే వనరులను గుర్తించి వాటి ద్వారా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో సర్పంచ్‌ల సహకారంతో అభివృద్ధి సాధ్య పడుతుందన్నారు. 2030, 2047 నాటికి సాధించాల్సిన లక్ష్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం

ఖాజీపేట: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా చేసుకుని పంచాయతీ అధికారులు అందరూ పనిచేయాలని ఎంపీడీఓ దివిజా సంపతి పంచాయతీ మండల అధికారులకు సూచించారు.

ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ, ఇంజనీరింగ్, వెల్ఫేర్, మహిళా పోలీస్, వీఆర్వోలు, సర్వేయర్లలతో సుస్థిర అభివృద్ధి, లక్ష్యల స్థిరీకరణ అనే అంశాల పై అవగాహనా సదస్సు జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఉంటున్న సమస్యలను గుర్తించాలని సూచించారు. పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా పారిశుద్ధ్యంతోపాటు అనేక విషయాలపై పూర్తి స్థాయిలో ప్రణాళికలతో ముందుకు సాగాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్‌డీ శ్రీనివాసులు, ఎంఈవో స్వర్ణలత, మండల ఇంజనీర్లు, పంచాయతీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ


శుభ్రం చేయిస్తున్న కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు: మున్సిపాలిటీలోని వార్డుల్లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. జిన్నాడ్డు మోటు, శివాలయం సెంటర్ వద్ద చెత్త పాయింట్లను కార్మికులతో శుభ్రం చేయించారు. కోట వీధిలోని కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగించాలని ఆదేశించారు. స్థానికులతో చెత్త సేకరణ, మంచినీటి సరఫరా, వీధి దీపాల సమస్యలపై ఆరా తీశారు. పాత మార్కెట్, రాజబాట వీధి ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించారు.

గురుకుల హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దారు గంగయ్యకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లు, అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని మంగళవారం విద్యార్థి యువజన, ప్రజా సంఘాల నాయకులు జగన్, ప్రతాప్ రెడ్డి, గడ్డం నరసింహులు కోరారు. తహసీల్దారు గంగయ్యను మంగళవారం వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా హాస్టళ్లలో మెయింటెనెన్స్, భోజనం, నీరు, వాష్ రూమ్స్, బాత్రూ, టీచర్ల కొరతతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారన్నారు. రాత్రి అయ్యే సరికి ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు 30 మంది కూడా హాజరు కావడం లేదన్నారు. హాస్టళ్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే


పెన్షనర్ సుబ్రహ్మణ్యాన్ని సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పోరుమామిళ్ల: విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల దినోత్సవాన్ని పోరుమామిళ్లలో జరుపుకోవడం ఆనందంగా ఉంది. ప్రతి సంవత్సరం అత్యధిక వయస్సున్న వారిని గౌరవిస్తూ, వారిని సన్మానించడం హర్షదాయకమని డాక్టర్ మార్కారెడ్డి, ఏపీజీబీ మేనేజర్ దశరథ పేర్కొన్నారు. పెన్షనర్స్ డే సందర్భంగా మంగళవారం సాయంత్రం స్థానిక శ్రీ రామచంద్రా రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 70 సంవత్సరాలు పైబడిన విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేసన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, గౌరవ సలహాదారు గురుమూర్తి, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి


తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ప్రొద్దుటూరు రూరల్: పట్టణంలోని అమృతా నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. కొత్తపల్లెలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ గంగయ్యకు మంగళవారం ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008, 2018 సంవత్సరాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాల్లో సుమారు 2,200 మంది ఇళ్లను నిర్మించుకున్నారన్నారు. అంతా నిరుపేదలే జీవిస్తున్నా.. మంచినీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు అధ్వానంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శేఖర్, వెంకటేష్, సుబ్బయ్య, షాబీర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎంపిక


ప్రతిభచాటిన విద్యార్థులతో ఎస్ఓ

అట్లూరు: మండల కస్తూర్బా బాలికల పాఠశాల విద్యార్థినులు జాతీయ స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రత్యేక అధికారి పణిశ్రీ, వ్యాయామా ఉపాధ్యాయురాలు ప్రమీళ మంగళవారం తెలిపారు. ఈనెల 16న రైల్వేకోడూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ (ఎస్‌జీఎస్) అండర్–19 కురాష్ ఆటల పోటీల్లో కళ్యాణి, సుహాషిని, స్పందన, సంధ్యారాణి మొదటి స్థానం సాధించి జాతీయ స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారు ఈనెల 30వ తేదీన ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాంమ్‌పూర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అలాగే నందిని, స్పందన, సుప్రియా రెండవ స్థానంలో నిలిచి వెండి పథకాన్ని సాధించారన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు